ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

జాతీయ రహదారిపై మృత్యుఘోష

- లారీని తప్పించబోతుండగా ఆటోను ఢీకొట్టిన కారు
- ముగ్గురు దుర్మరణం.. మరో నలుగురికి తీవ్ర గాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 4 : ఆగి ఉన్న లారీని తప్పించబోతుండగా ఆటోను వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో విజయవాడ-హైదరాబాద్ హైవేపై గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలో మానస నగర్ కాలనీ వద్ద హైటెక్ బస్టాండ్ సమీపంలో 65వ జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని డ్రైవర్ రోడ్డుపై నిలిపాడు. అదే సమయంలో అర్వపల్లి నుంచి సూర్యాపేటకు 17 మంది ప్రయాణికులతో వస్తున్న ఆటో డ్రైవర్ లారీని గ్రహించి తప్పిస్తుండగా వెనుక నుంచి అతి వేగంతో వచ్చిన ఎర్టిగా కారు ఆటోను ఢీకొట్టింది. దాంతో ఆటో ముందు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న జాజిరెడ్డి గూడెం సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న సూర్యాపేట పట్టణానికి చెందిన చింతరెడ్డి సరితారెడ్డి (49), సూర్యాపేట మండలం లక్ష్మీతండాకు చెందిన లునావత్ రుక్కమ్మ (55), తుంగతుర్తి మండలం పసునూరు గ్రామానికి చెందిన గొలుసు వేదశ్విని (17 నెలలు) అక్కడికక్కడే మృతి చెందారు. అర్వపల్లి మండలం కాసర్లపహాడ్‌కు చెందిన కంపసాటి మహేశ్, పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెర్కుపల్లి సైదమ్మ, చింటు, చెర్కుపల్లి శైలజ, విజయేందర్, వల్లభాపురం గ్రామానికి జీడిమెట్ల సైదులు, తుంగతుర్తి మండలం గొలుసుల సంధ్య, కొమ్ము సువర్ణ, గుంపుల గ్రామానికి చెందిన హైమావతి, రమణ, అడివెంల గ్రామానికి చెందిన సాయిరెడ్డి, ఏనుబాములకు చెందిన లావణ్య, పావని గాయపడ్డారు. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు తమ వాహనాల్లో క్షతగాత్రులను, మృతదేహాలను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జనరల్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిగ్భ్రాంతి

సూర్యాపేటలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాహుల్ హెగ్డేను కోరారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సీతయ్య

తుంగతుర్తి, ఏప్రిల్ 4 : మండల కేంద్రంలోని ఆనంద్ గార్డెన్స్‌లో ఈ నెల 6న జరిగే పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికోండ సీతయ్య పార్టీ శ్రేణులను కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. సన్నాహక సమావేశానికి ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గుండగాని రాములు, గోపగాని శ్రీనివాస్, తడకమల్ల రవికుమార్, మల్లెపాక వెంకన్న, ఉప్పల నామమల్లు, గోపగాని వెంకన్న, మురళి, సాయి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై 6న బీఆర్ఎస్ నిరసన

నేరేడుచర్ల, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 6న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని బీఆర్ఎస్ స్థానిక నాయకులు గురువారం ఒక ప్రకటన వెలువరించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు గిట్టుబాటు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ అందించాలని, పంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన దీక్షకు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ హాజరు అవుతున్నందున నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాదిగలను మోసం చేసే పార్టీలకు పతనం తప్పదు

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజయ్యమాదిగ

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 4 : మాదిగలను మోసం చేసే ఏ పార్టీకైనా పతనం తప్పదని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో రెడ్లు, పటేళ్ల పాలన కొనసాగిస్తున్నదని, రాష్ట్రంలో 17 అసెంబ్లీ స్థానాల్లో 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా అవమానించినట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ పిలుపు మేరకు గురువారం పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. రాష్ట్రంలో 5 శాతం ఉన్న రెడ్లకు 6 సీట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింతబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చింతలపాటి చిన శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, బొజ్జ వెంకన్న, దైద వెంకన్న, చెరుకుపల్లి సతీశ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

- గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యదర్శి అనితారామచంద్రన్

సూర్యాపేట , ఏప్రిల్ 4 : వేసవిలో ప్రతి చివరి గ్రామానికి తాగునీరు అందించాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తాగునీటిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులు ఉన్నందున ఈ మూడు మాసాలు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా నీటి ఎద్దడి రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి దాని ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నిల్వలు, లభ్యత, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన హ్యాండ్ పంప్స్, పంప్ సెట్స్, ఓపెన్ వెల్స్, పైప్‌లైన్లను సత్వరమే అందుబాటులోకి తేవాలన్నారు. ఎక్కడా కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వొద్దని చెప్పారు. గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య రానీవ్వం : కలెక్టర్

జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.3.65 కోట్లతో 184 పనులు చేపట్టినట్లు ఇప్పటికే 151 పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. డీఎంఎఫ్‌టీతో సుమారు రూ.7 కోట్లతో 278 పనులను మంజూరు చేయడం జరిగిందని వాటిలో 211 పనులు పూర్తి కాగా 67 పనులు పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు. ఓఆర్ఎం కింద రూ.3.29 కోట్లతో 631 పనులు చేపట్టగా ఇప్పటికీ 238 పనులు పూర్తి కాగా 393 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇతర నిధులతో తాగునీటి సమస్యకు సంబంధించిన పనులు వేగంగా చేపట్టడం జరిగిందని పనులు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం మునగాల మండలం మాదారం నర్సరీ, పంప్ వెల్, పైప్ లైన్ పనులను వారు పరిశీలించారు. అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక, ఎంబీ ఎస్‌సీ వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన రాజు, ఆర్డీఓలు సూర్యనారాయణ, వేణుమాదవ్ పాల్గొన్నారు.

మునగాల మండలం మాదారంలో పంప్‌సెట్ పనులను పరిశీలిస్తున్న గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర కార్యదర్శి అనితారామచంద్రన్, కలెక్టర్ వెంకట్రావ్

జిల్లాలో 51,290 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు

సూర్యాపేట, ఏప్రిల్ 4 : జిల్లాలో 51,290 మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను ఆయన విడుదల చేశారు. జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ పరిధిలో 51,290 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. సూర్యాపేటలో 26,059, కోదాడలో 12,120, హుజూర్‌నగర్‌లో 13,111 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. పట్టభద్రుల ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సూర్యాపేటలో 31, కోదాడలో 22, హుజూర్‌నగర్‌లో 18 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని తెలిపారు.

రైస్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, పత్రాలు అందజేస్తున్న అమరేందర్

కుట్టు మిషన్ల పంపిణీ

నాగారం, ఏప్రిల్ 4 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని రైస్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ మొగుళ్ల అమరేందర్‌గౌడ్ అన్నారు. గురువారం సంస్థ ఆధ్వర్యంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో మండలంలో మూడు నెలలుగా శిక్షణ పొందుతున్న వారికి కుట్టు మిషన్లు, పత్రాలు అందజేసి మాట్లాడారు. మహిళలు తాము నేర్చుకున్న శిక్షణతో ఉపాధి చూసుకుని ఆర్థిక స్వావలంభన సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి చిల్లర చంద్రమౌళి, మార్కెట్ మాజీ డైరెక్టర్ మంచి నీళ్ల మహేందర్, బుడిగ పవన్, నరేశ్‌కుమార్ రెడ్డి, రమేశ్, కుట్టు మిషన్ శిక్షకురాలు దేశగగాని శోభ, మహిళలు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సమర్థవంతంగా గంజాయి నిర్మూలన

- ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 4 : జిల్లా పోలీస్ శాఖ గంజాయి నిర్మూలనపై సమర్థవంతంగా పని చేస్తున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. గంజాయి సరఫరా, వినియోగంపై పూర్తి స్థాయిలో నిఘా ఉంచి మూడేండ్లలో జిల్లా వ్యాప్తంగా 166 కేసులు నమోదు చేసి 4,258.53 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 424 మంది నిందితులపై కేసులు నమోదు చేశామని, వారిలో 8 మందిపై పీడీ యాక్ట్ నమోదైనట్లు వెల్లడించారు. కోర్టుల నుంచి సీసీ నంబర్స్ పొందిన కేసుల్లో సీజ్ చేసిన గంజాయిని సూర్యాపేట జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వీర్యం చేస్తున్నట్లు వివరించారు. గంజాయి నిర్మూళన అవగాహన పోస్టర్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. గంజాయి వల్ల సమాజానికి హాని ఉన్నదని, యువశక్తి నిర్వీర్యం అవుతుందని కావునా గంజాయి నిర్మూళనతో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ మట్టయ్య, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు రాము, రఘువీర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- పీఏసీఎస్ సీఈఓ వెంకన్న

నూతనకల్, ఏప్రిల్ 4 : రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పీఏసీఎస్ సీఈఓ సమ్మెట వెంకన్న అన్నారు. గురువారం మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పంటను మిషన్లతో కోసిన వెంటనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకుండా ఒకటి రెండు రోజులు ఆరబెట్టి తేమ శాతం తగ్గిన తర్వాతే తీసుకురావాలని పేర్కొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

అర్వపల్లి : రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామని ఏఓ శశిధర్ రెడ్డి అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో బొల్లంపల్లి, కొమ్మాల, కోడూరు, లోయపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేశ్, సీసీ పద్మావతి, ఏఈఓ శోభారాణి, సంఘ బంధం అధ్యక్షురాలు కేసగాని మంజు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

నాగారం : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలని ఫణిగిరి రెవెన్యూ క్లస్టర్ ఏఈఓ రమ్యతేజ అన్నారు. మండలంలోని ఫణిగిరి, ఈటూరు గ్రామాల్లో తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు.

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ వెంకన్న

నాగారం : ఫణిగిరిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఏఈఓ రమ్యతేజ

అర్వపల్లి : బొల్లంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఓ శశిధర్‌రెడ్డి

ప్రపంచ పటంలో ఫణిగిరి బౌద్ధ క్షేత్రం

- రాష్ట్ర పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతి హోళీకేరి

నాగారం, ఏప్రిల్ 4 : కళాఖండాలు, అద్భుతమైన చారిత్రక బౌద్ధ శిల్పాలు, నాణేలు వంటి వాటితో మారుమూలన ఉన్న ఫణిగిరి గ్రామం ప్రపంచ పటంలోకెక్కిందని రాష్ట్ర పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతి హోళీకేరి అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలోని ప్రఖ్యాత బౌద్ధ క్షేత్రంలో జరుగుతున్న తవ్వకాల్లో ఇటీవల బయల్పడిన సీసపు నాణేలను గురువారం వారు పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. క్రీ.శ. 1వ శతాబ్ద కాలం నాటి ప్రజలు వాడిన నాణేలు ఒకేచోట పెద్ద మొత్తంలో లభించడం భారతదేశంలోనే తొలిసారి అన్నారు. ఫణిగిరి తవ్వకాల్లో 3,730 నాణేలు లభించడం అరుదైన విషయమని, ఇక్కడ ఇంకా వెలుగులోకి రావాల్సిన విషయాలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. ఫణిగిరిలో లభించిన సీసపు నాణేలతో ఒక మైలురాయిని దాటిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, నాగార్జున కొండల్లో లభించని బౌద్ధ చారిత్రక ఆనవాళ్లకు మించి ఫణిగిరిలో లభ్యమవుతున్నాయని ఇవి చాలా అద్భుతమైనవని చెప్పారు. ఫణిగిరిలో జరిపిన తవ్వకాల్లో ఇక్ష్వాకుల కాలం నాటి మట్టి పాత్రలో 3,730 సీసపు నాణేలు, రాతి పూసలు, బౌద్ధ భిక్షువులు మెడలో ధరించే మట్టి పూసలు, సున్నపు రాతి విగ్రహాలు లభించాయన్నారు. తవ్వకాల్లో ఒక మట్టి కుండ లభించిందని తెలిపారు. ఆ కుండ 16.7 సెంటీమీటర్ల వ్యాసం, 15 సెం.మీ. ఎత్తు కలిగి పూర్తిగా సీసపు నాణేలతో నిండి ఉన్నదన్నారు. నాణేలకు ఒక వైపు ఏనుగు, మరో వైపు ఉజ్జయిని గుర్తులు కలిగి ఉన్నాయని, భారతదేశంలో ఇంత వరకు ఎక్కడా ఇలాంటివి దొరకలేదని పేర్కొన్నారు. క్రీ.శ. 2-4 శతాబ్దంలో ఇక్ష్వాకుల కాలం నాటి నాణేలుగా నిర్ధారించినట్లు తెలిపారు. విలువైన ఈ సంపదను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. ఇక్కడి బౌద్ధ సంపద అమరావతి, నేలకొండపల్లి మరెక్కడా లేదన్నారు. విదేశాల నుంచి కూడా ఫణిగిరి వైపు పర్యాటకులు చూస్తున్నారని, ఫణిగిరి బౌద్ధ క్షేత్రం అన్ని హంగులతో విహార క్షేత్రంగా విరాజిల్లబోతుందని అభిప్రాయపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చాడ గ్రామంలో కూడా తవ్వకాలు ప్రారంభించామన్నారు. వారి వెంట సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ లత, ఎస్కలేటర్ డైరెక్టర్ సాగర్, ఏడీ మల్లునాయక్, తాసీల్దార్ బ్రహ్మయ్య, పురావస్తు శాఖ సిబ్బంది ఉన్నారు.

నాణేలను పరిశీలిస్తున్న శైలజారామయ్యర్, భారతి హోళీకేరి

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

- సీపీఐ(ఎంఎల్) నాయకులు

గరిడేపల్లి, ఏప్రిల్ 4 : సాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న చెరువులు, కుంటలను తక్షణమే నింపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో గల సాగర్ ప్రధాన ఎడమ కాల్వపై పార్టీ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో భూగర్భ జలాలు బాగా తగ్గిపోయి తాగునీటికి సైతం ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కావునా ప్రభుత్వం సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ములకలపల్లి రాములు, న్యూడెమోక్రసీ నాయకులు పోటు లక్ష్మయ్య, సీపీఎం నాయకులు యానాల సోమయ్య, న్యూడెమోక్రసీ నాయకులు మేకల కనకారావు, సైదులు, బ్రహ్మం, నాగేశ్, గోపి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : సాగర్ ఆయకట్టు కింద ఉన్న నల్లగొండ, సూర్యాపేట జిల్లాలోని చెరువులను నింపి ప్రజల దాహార్తిని తీర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లాలోని ఏ ఒక్క చెరువును కూడా నింపకపోతే భూగర్భ జలాలు అడుగంటి రానున్న కాలంలో తాగడానికి నీరు దొరకదన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని అన్ని మేజర్లకు నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు ఊదర వెంకన్న పాల్గొన్నారు.

గరిడేపల్లి : వెలిదండ వద్ద సాగర్ ఎడమ కాల్వపై ధర్నా చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

సుదర్శన్‌రెడ్డి , జగన్మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవనంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన సుదర్శన్‌రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ విరమణ పొందిన అలుగుబెల్లి జగన్మోహన్‌రెడ్డిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో రెడ్డి కుల సంక్షేమం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోదాల రంగారెడ్డి, చిలుముల సునీల్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, సోమిరెడ్డి, అనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నేరేడుచర్ల, ఏప్రిల్ 4 : మండలంలోని సోమారం గ్రామ వద్ద ట్రాక్టర్-బైక్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. గరిడేపల్లి మండలం ముత్యాలనగర్‌కు చెందిన మిగిడి జానయ్య (48) కల్లూరు గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా ధాన్యం లోడుతో మిర్యాలగూడకు వస్తున్న ట్రాక్టర్ సోమారం గ్రామ శివారులో బైక్‌ను ఢీ కొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన జానయ్యను చికిత్స కోసం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ పారారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి'

నేరేడుచర్ల, ఏప్రిల్ 4 : నేరేడుచర్లలోని సర్వే నంబర్ 243, 244 ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు గోగినపల్లి వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పట్టణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, కారింగుల వెంకన్న, లలిత, రేణుక, అఖిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు టీవీ బహూకరణ

నేరేడుచర్ల, ఏప్రిల్ 4 : మండలంలోని దిర్శించర్ల ప్రభుత్వ పాఠశాలకు నేరేడుచర్లకు చెందిన గుంటిపల్లి సూర్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుమార్తెలు జి.రమాదేవి, కవిత గురువారం రూ.12 వేల విలువ గల టీవీని ఎంఈఓ చత్రునాయక్, పాఠశాల హెచ్ఎం కట్టా మాధవికి అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పుట్లూరు సత్యనారాయణరెడ్డి, నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం బట్టు మధు, నేరేడుచర్ల పీఆర్టీయూ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ బోధన అభినందనీయం

విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా డిజిటల్ బోధన అందించడం అభినందనీయమని ఎంఈఓ చత్రునాయక్ అన్నారు. పట్టణంలోని శ్రీవాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొణతం సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.